# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

# Bullet Edition

గురువారం, 15 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 4 PM






## మహనీయులకు దేశం రుణపడి ఉంది

### ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి ఎదగాలి

### ఆధునిక సాంకేతికతకు పెద్దపీట

### భారత్ ప్రపంచానికే స్ఫూర్తిదాయకం

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

### ఎర్రకోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ప్రజాస్వరం): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను ప్రతీ భారతీయుడు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గిందని, స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారని, ఇప్పుడు మన దేశ జనాభా 140 కోట్లకు చేరిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 140 కోట్ల మంది ప్రజల కలలను సాకారం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. భారత ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని, భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని, తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను మార్చాలని ప్రధాని అన్నారు.

#### దేశాభివృద్ధికి సంస్కరణలు అవసరం

ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

#### అభివృద్ధికి బ్లూప్రింట్

అభివృద్ధి బ్లూ ప్రింట్‌గా సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. 'నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం' సంకల్పంతో ముందుకెళ్తున్నామని, బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలుచేశామని చెప్పారు. భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని జల్‌జీవన్ మిషన్ ద్వారా 15 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని, భారత్‌లో చిరు ధాన్యాలు ప్రపంచంలో అందరికీ చేరాలని మోదీ ఆకాంక్షించారు. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందని, దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని, యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తామని, భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భావిస్తుందన్నారు. స్వయం సహాయక రంగాలకు ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని, కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

#### అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తి

అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, వందల కొద్దీ స్టార్టప్‌లు వచ్చాయని, ప్రైవేట్ ఉపగ్రహాలు, రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరో 10 కోట్ల మంది మహిళలు.. కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరారన్నారు. మౌలిక సదుపాయాల్లో పెను మార్పులు తీసుకొచ్చామని, దేశ హితమే ప్రథమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, మన కలలు సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

#### నూతన నేర చట్టాల్లో న్యాయానికే ప్రాధాన్యం

నూతన నేర చట్టాల్లో శిక్షల కంటే న్యాయానికే ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ ప్రమేయం అతితక్కువగా ఉండేలా పౌర సేవలు ఉంటాయని, ఎగుమతుల్లో పురోగతితో ప్రపంచ ప్రగతిలో భారత్ పాత్ర పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

#### జీవన సౌలభ్యమే లక్ష్యంగా సేవలు

జీవన సౌలభ్యమే లక్ష్యంగా ప్రభుత్వ సేవలు అందాలని, ఒకప్పుడు సెల్‌ఫోన్లు దిగమతి చేసుకునే వాళ్లమని, ఇప్పుడు భారత్‌లోనే తయారు చేసుకుంటున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లే దుస్థితిని తప్పిస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో 75వేల మెడికల్ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. చంద్రయాన్ ప్రయోగం యువతలో శాస్త్రీయ ఆసక్తిని పెంచిందని, ప్రపంచానికి సేంద్రీయ ఆహారం అందించే స్థాయికి మన రైతులు చేరాలని ప్రధాని ఆకాంక్షించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మోదీ స్పష్టం చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే.. భయపడే పరిస్థితి తీసుకొస్తామన్నారు. ఇండియా 5జీ తోనే ఆగదని.. 6జీ పైనా అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా భారత్‌ను తయారుచేస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

#### బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై 140 కోట్ల మంది ఆందోళన

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో ఇటీవలి నెలకొన్న రాజకీయ అశాంతి పరిస్థితుల నేపథ్యంలో అక్కడి హిందూ సమాజంపై జరుగుతున్న దాడులపై మోదీ స్పందించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీల భద్రతపై 140 కోట్ల మంది భారతీయులు ఆందోళన చెందుతున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. భారత్ ఎల్లప్పుడూ బంగ్లాదేశ్ అభివృద్ధిని కాంక్షించే శ్రేయోభిలాషిగా ఉంటుందని, అక్కడి పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి వస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనారిటీలకు భద్రత కల్పించాలని భారతీయులు కోరుకుంటున్నారని మోదీ అన్నారు.



## శిరసానమామి

### మహనీయు త్యాగాల ఫలితమే మన స్వాతంత్ర్యం

### అహింసనే ఆయుధంగా స్వాతంత్ర్య సంగ్రామం

### గాంధీ మహాత్ముడు చూపిన బాట అనుసరణీయం

హైదరాబాద్, ఆగస్టు 15 (ప్రజాస్వరం) : గోల్కొండ కోటపై జాతీయ జెండా రెప రెపలాడింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోటలో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఎగురవేసి తొలిసారి గోల్కొండ కోట నుంచి జాతిని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారతదేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజు మనందరికీ పర్వదినం. మన దేశ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని మువ్వన్నెల జెండాగా సగర్వంగా ఎగరేసిన ఈ రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని తెలిపారు. ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగ ఫలం. సుదీర్ఘ పోరాట ఫలితం. అనేక ప్రాణత్యాగాలు, అనేకానేక జీవిత త్యాగాల ఫలితం ఈ స్వాతంత్ర్యం. ఎందరో మహామహుల త్యాగాల వెల కట్టలేని బహుమతి ఈ స్వాతంత్ర్యం. అటువంటి మహనీయులందరికీ శిరస్సు వంచి వినమ్రంగా నమస్కరిస్తున్నారు. అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్ర్య సంగ్రామం. అహింస అనే ఆయుధంతో ఇంత గొప్ప విజయాన్ని సాధించవచ్చు అని రుజువు చేసి ప్రపంచానికి సరికొత్త యుద్ధ తంత్రాన్ని చూపించిన దేశం మనది. ఆ ఘనత, ఆ కీర్తి జాతిపిత మహాత్మాగాంధీకి దక్కుతుంది. ఈ సందర్భంగా ఆ మహనీయుడి దార్శనికతకు, శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.

#### నెహ్రూ గొప్ప మానవతావాది

శతాబ్దాల దోపిడి, అణచివేతల తరువాత స్వాతంత్ర్యానంతరం 1947 లో అధికారం చేపట్టే నాటికి అంతా శూన్యం. చేతులు కాళ్లు కూడదీసుకుని, ఒక్కొక్క వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, పారదర్శక, ప్రజాస్వామ్య పాలన అందించాల్సిన బాధ్యత నాటి నాయకత్వంపై పడింది. తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రచించి, ఈ దేశానికి వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి అన్నవి రెండు కళ్లు అని నమ్మి ఆ దిశగా తొలి అడుగులు వేయించారు. నెహ్రూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను మనం ఈ రోజు ఆధునిక దేవాలయాలుగా పిలుచుకుంటున్నాం. ఈ దేశంలో కోట్లాది ఎకరాలు పంటలతో పచ్చతోరణాన్ని కట్టుకున్నాయంటే దానికి కారణం నెహ్రూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులే. నెహ్రూ ప్రాజెక్టులు ప్రారంభిస్తే వాటిని పూర్తి చేసి, కోట్లాది మంది రైతుల పొలాలకు సాగు జలాలు పారించిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు. పారిశ్రామికంగా ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు ఆ స్వర్ణయుగంలో నెలకొల్పబడినవే. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం చేపట్టి అన్నిరంగాల సమగ్రాభివృద్ధికి కృషిచేసిన ఘనత నాటి ప్రభుత్వాలది. బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రమే తెలిసిన బ్యాంకింగ్ వ్యవస్థను జాతీయాకరణతో గ్రామీణ ప్రజల చెంతకు చేర్చిన ఘనత, ప్రతి పౌరుడికి బ్యాంకును అందుబాటులోకి తెచ్చిన గొప్పతనం ఆ నాటి దార్శనికుల వల్లనే జరిగింది. 1947 వరకూ ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్న మనదేశం, ఈ నాడు ప్రపంచంలో ఆహారధాన్యాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాలలో ఒకటిగా ఎదగడానికి కారణం స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన హరిత విప్లవమే. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ప్రజల సామాజిక, ఆర్థిక పునరుజ్జీవనానికి గీటురాయిగా మారింది. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశం టెలికమ్యూనికేషన్స్ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. అంతరిక్ష, అణుశక్తి కార్యక్రమాల్లో స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించే అతికొద్ది దేశాల సరసన భారతదేశాన్ని ఆనాడే నిలుపగలిగారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ హయాంలో ఈ దేశానికి సాంకేతిక విప్లవాన్ని తీసుకు రాగా ఆ తర్వాత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మన తెలుగు బిడ్డ, తెలంగాణ బిడ్డ స్వర్గీయ పీవీ నర్సింహారావు గారు ఆర్థిక విప్లవాన్ని తీసుకువచ్చి భారత దేశ ముఖచిత్రాన్నే మార్చేశారు. ఇట్లా నెహ్రూ హయాంలో మొదలైన భారత దేశ విజయ ప్రస్థానం ఇందిరా, రాజీవ్, పీవీ హయాంతో ప్రపంచంలో అగ్రదేశాల సరసన చేరే స్థాయికి ఎదిగింది.

### రుణమాఫీపై విపక్షాల వక్రభాష్యం

ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటే విపక్షాలు వక్రభాష్యం చెప్పాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇవాళ గోల్కొండ కోటపై జాతీయ జెండాను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగఫలంతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని అన్నారు. చరిత్రలో కనివిని ఎరుగని విధంగా అహింసనే అయుధంగా చేసుకుని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు.

### బీఆర్ఎస్ అధిక వడ్డీలకు అప్పులు



బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి ప్రజల మీద భారం మోపే తత్వం తమ ప్రభుత్వానిది కాదని అన్నారు. ఎన్నికల సందర్భంగా వరంగల్ డిక్లరేషన్ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు రుణమాఫీ చేసి చూపించామని తెలిపారు. కానీ, ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ విపక్షాలు అందుకు వక్రభాష్యం చెప్పాయంటూ ఫైర్ అయ్యారు. రుణమాఫీలో అక్కడక్కడ తప్పులు దొర్లుతున్నాయని, టెక్నికల్ సమస్యలతో కొంత మంది రైతులకు రుణమాఫీ అందలేదని తెలిపారు. రుణమాఫీ కాని వారి కోసం ఆయా జిల్లాల కలెక్టరేట్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. రైతుల పూర్తి వివరాలు అక్కడ అదందజేస్తే రుణమాఫీ తప్పకుండా అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసానిచ్చారు.

### సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ ప్రారంభం

#### పంప్ హౌజ్-2ను స్విచ్ ఆన్ చేసిన సీఎం రేవంత్

ఖమ్మం, ఆగస్టు 15 (ప్రజాస్వరం) : సీతారామ ఎత్తిపోతల పథకం పంపుహౌస్, రాజీవ్ కెనాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీఎం రేవంత్ రెడ్డి పంపుహౌస్–2ను స్విచ్చాన్ చేసి గోదావరి జలాల ఎత్తిపోతలను ప్రారంభించారు. ఈ పథకం కింద సుమారు 3.29 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 3.45 లక్షల ఎకరాల ఇప్పటికే వాడుకలో ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందనుంది. సీతారామ పంప్ హౌజ్–1ను అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కమలాపురంలో 3వ పంప్ హౌజ్–3ని రాష్ట్ర డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు.





### అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

#### బాచుపల్లి ఎర్రకుంటలో భారీ భవనం నేలమట్టం

మేడ్చల్, ఆగస్టు 15 (ప్రజాస్వరం) : ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు, చెరువులు, కుంటలు, పార్క్ స్థలాలు, బఫర్ జోన్ల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ప్రభుత్వం భూములను కబ్జా చేయాలనే ఆలోచన రాకుండా చేసేందుకు ఆ సంస్థ నేరుగా యాక్షన్‌లోకి ఎంటరైంది. ఈ క్రమంలోనే ఇవాళ తెల్లవారుజామున నిబంధనలకు విరుద్ధంగా మేడ్చల్ జిల్లా బాచుపల్లి ఎర్రకుంటలో నిర్మాణంలో బహుళ అంతస్థుల బిల్డింగ్‌ను అధికారులు నేలమట్టం చేశారు. హైడ్రా కమిషనర్ రంగానాథ్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు.